క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



నెల్లూరు(అర్బన్): కపాడిపాళెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్, టీబీ వ్యాధి నివారణపై చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఆరోగ్య కేంద్ర డాక్టర్ కల్యాణ్, డీఆర్టీబీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు (టౌన్): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మహిళా టీచర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని మంగళవారం కలిసి సమస్యలను తెలియజేశారు. మహిళా టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సరస్వతి పద్మజ, రాష్ట్ర అధ్యక్షులు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి రాధారాణి, గౌరవ సలహాదారు సుధావాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్నారా తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లూరు(బారకాసు): నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నామని ఎన్‌హెచ్‌ఆర్‌జేసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆచారి వీధిలోని నూతన జర్నలిస్ట్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. జిల్లా ప్రెసిడెంట్‌గా కలిమేలి పవన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా మాలిక్‌బాషా, రూరల్ ప్రెసిడెంట్‌గా సర్వేపల్లి సునీల్‌కుమార్‌ను ఎన్నుకున్నామని చెప్పారు.

మూలస్థానేశ్వరుడికి విశేషాభిషేకాలు



నెల్లూరు(బృందావనం): ఆడికృత్తికను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు, అర్చనలను మంగళవారం నిర్వహించారు. వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పేట ఉత్సవాన్ని జరిపారు. ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అర్జీల స్వీకరణ రేపు

నెల్లూరు(బారకాసు): ప్రజల నుంచి అర్జీలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ గురువారం స్వీకరించనున్నారని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన భవన నిర్మాణాల అప్రూవల్ సంబంధిత సమస్యలు, ఇతర అంశాలను మంత్రి దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

అనుమతుల్లేకుండా నిర్మిస్తే కఠిన చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. పట్టణంలోని రామకృష్ణానగర్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారనే సమాచారంతో మంగళవారం ఆయన అక్కడికి చేరుకుని నిర్మాణాలను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. నగర పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు వీధుల్లోని చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఆ తర్వాత పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు.

సింహపురిలో ట్రాఫికర

- ప్రధాన కూడళ్లలో కానరాని ట్రాఫిక్ పోలీసులు
- ఉన్నా.. పిచ్చాపాటి కబుర్లతో కాలక్షేపం

నెల్లూరు(క్రైమ్): సింహపురిలో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. అంతంతమాత్రంగా ఉన్న రహదారులు.. ఆక్రమణలు.. నిబంధనలపై అవగాహన లేని వాహనచోదకులు.. ఎక్కడి పడితే అక్కడ వాహనాలను నిలపడం.. అలంకారప్రాయంగా మారిన సిగ్నలింగ్ వ్యవస్థ.. విధుల్లో కొందరు సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో సమస్య జఠిలమవుతోంది.

ఇష్టానుసారంగా పార్కింగ్

మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్ పాయింట్‌లో సిబ్బంది లేరు. దీంతో సమీపంలోని హోటల్.. దుకాణాల వద్ద రోడ్లపైనే కార్లు, వాహనాలను నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తింది. వీఆర్సీ, గాంధీబొమ్మ, ట్రంక్ రోడ్డు, కనకమహల్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో వన్‌వేలోనూ వాహనదారులు రాకపోకలను యథేచ్ఛగా సాగించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

నగరంలో నెల్లూరు సౌత్, నార్త్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 110 మంది సిబ్బందికి గానూ 88 మందే ఉన్నారు. వీరిలో కొందరు కోఆపరేటివ్, ఐటీ కోర్, ఎంటీ విభాగాల్లో అటాచ్‌మెంట్‌లో ఉన్నారు. ఉన్న సిబ్బందిలో కొందరు మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తుండటంతో సమస్య జఠిలమవుతోంది. నగర జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గాంధీబొమ్మ వద్ద గందరగోళంగా వాహనాలు

ఇదీ తీరు..

ఆత్మకూరు బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ట్రాఫిక్ పోలీసుల పనితీరును సాక్షి మంగళవారం పరిశీలించింది. అధిక ప్రాంతాలోల్ పోలీసులు కనిపించకపోగా, కొన్ని ప్రాంతాల్లో కొంత సమయమే విధుల్లో ఉండి ఆపై అదృశ్యమయ్యారు. కొందరు సిబ్బంది కేటాయించిన విధులను పక్కనబెట్టి సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంకొన్ని చోట్ల పిచ్చాపాటి కబుర్లు.. సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలం గడిపారు. మొత్తమ్మీద ట్రాఫిక్, అధికారుల పర్యవేక్షణ లోపం.. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నగరంలో ట్రాఫిక్ టెర్రరగా మారింది.

దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ పోస్ట్‌లు

అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోస్ట్‌లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. విధుల్లో ఉన్న కొందరు సిబ్బంది సెల్‌ఫోన్లు చూసుకుంటూ.. మిత్రులతో పిచ్చాపాటి కబుర్లు చెప్పుకొంటూ కాలక్షేపం చేస్తున్నారు. మరోవైపు వాహన తనిఖీలు, జరిమానాల విధింపునకే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పరిమితమవుతున్నారు. ఫలితంగా వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయి.



మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఇలా..

నడిరోడ్డుపైనే ఆటోలు

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ట్రాఫిక్ పాయింట్‌లో సిబ్బంది ఒక్కరూ లేరు. ఇక్కడ వాహనాల రద్దీ నిత్యం అధికంగా ఉంటుంది. సిబ్బంది అందుబాటులో ఉంటూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సి ఉంది. అయితే ఆ పరిస్థితే లేకపోవడంతో ఆటోలను నడిరోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలిపి ప్రయాణికుల కోసం ఎదురుచూస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



ఆత్మకూరు బస్టాండ్ వద్ద టెర్రర్

ఆత్మకూరు బస్టాండ్ వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అసలే అత్యంత రద్దీ ప్రాంతం.. ఆపై నడిరోడ్లపైనే వాహనాలను నిలిపేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. ఇక్కడున్న సిబ్బందిలో ఒకరు సెల్‌ఫోన్ చూసుకుంటుండగా.. మరొకరు అక్కడున్న చిరు వ్యాపారులతో మాట్లాడుతూ కనిపించారు.



ఆటోస్టాండ్‌కు అడ్డాగా బ్రిడ్జి

స్టోన్‌హౌస్‌పేట వద్ద సిబ్బంది అందుబాటులో లేరు. నడిరోడ్లపైనే ఆటోలను నిలిపేస్తున్నా, ప్రశ్నించే నాథుడే లేరు. మరోవైపు ఇక్కడి బ్రిడ్జీలు ఆటో స్టాండ్లు, వ్యాపారాలకు అడ్డాగా మారిపోయాయి.





ఏసీ సెంటర్ వద్ద కబుర్లలో నిమగ్నమైన కానిస్టేబుల్

ఆలయంపై రాజకీయాలు సరికావు



మాట్లాడుతున్న ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంపై రాజకీయం చేయడం సరికాదని దేవస్థాన పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని దేవస్థానంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆలయాన్ని బుధవారం ముట్టడించి.. తమ స్వాధీనంలోకి తీసుకొని.. తమ వారితో ఆలయ పాలకమండలి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం చేస్తారంటూ వదంతులు సృష్టిస్తూ ఆర్యవైశ్యుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. బైలా మేరకు నడుచుకుంటే ఎలాంటి అభ్యంతరాలు ఉండవని చెప్పారు. అధికారం ఉందనే దర్పంతో ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటామంటూ కొందరు చేస్తున్న ప్రచారం సరికాదని సూచించారు. బైలా మేరకు 3894 మంది సభ్యులతో సర్వసభ్య సమావేశాన్ని ఆగస్ట్ 18న నిర్వహించనున్నామని చెప్పారు. ప్రస్తుత కమిటీ కాల పరిమితి ఆగస్ట్ 20తో ముగియనుందని, అన్ని వివరాలను ఆ రోజున తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ శ్రీరామ్ సురేష్, కోశాధికారి వొమ్మిన మురళీకృష్ణ, కార్యదర్శి సోమిశెట్టి రమేష్, ఉపాధ్యక్షుడు పేర్ల జనార్దన్, సహాయ కార్యదర్శి కోట రమేష్, కమిటీ సభ్యులు బైసాని జ్యోతిప్రసాద్, కామేశ్వరరావు, కనమర్లపూడి కల్యాణి, చందోలు సునీల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ప్రాకారోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరువాడిప్పూర ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను కమనీయంగా జరిపారు. ఉభయకర్తగా రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

యూపీహెచ్‌సీ ప్రారంభం



నెల్లూరు(బారకాసు): నగరంలోని 36వ డివిజన్ రామయ్యబడి సమీపంలో రూ.1.1 కోట్లతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నేతలు సురేంద్రబాబు, రసూల్, శశిధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులు వేగవంతం



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలో రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని జేసీ కార్యాలయంలో ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంక్‌రోడ్డు, మినీ బైపాస్, పొదలకూరు రోడ్డుపై ఉన్న గుంతలు, ప్యాచ్‌లను గుర్తించి మరమ్మతు పనులను పూర్తి చేయాలని తెలిపారు. కొమ్మలను తొలగించే సమయంలో నగరపాలక సంస్థకు సమాచారమివ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్పొరేషన్ వాహనాల ద్వారా కొమ్మలను తొలగించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. సూర్యగృహ యోజన అమల్లో భాగంగా నగరంలో సోలార్ సౌకర్యం గల భవనాలు ఇతర వివరాలను నివేదిక రూపంలో అందించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, ఇంజినీరింగ్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు మురళీకృష్ణ, సోమశేఖర్, చంద్రయ్య, ఎంహెచ్‌ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

నెల్లూరు టౌన్ ఈఈ బదిలీ



సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా విధులు నిర్వర్తిస్తున్న సోమశేఖర్‌రెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. నెల్లూరు రూరల్ డివిజన్ ఈఈగా బదిలీ అయ్యారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రంగనాయకులపేట సమీపంలోని రైల్వేగేట్ వద్ద సింగిల్ నంబర్లాడుతున్న ఇద్దర్ని సంతపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రంగనాయకులపేటకు చెందిన కాలేషా, బాబును అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1600ను స్వాధీనం చేసుకున్నారు.

మాతాశిశు సంరక్షణకు కిల్‌కారి సేవలు



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): మాతాశిశు సంరక్షణ చర్యల్లో భాగంగా కిల్‌కారి మొబైల్ అకాడమీ సేవలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనిపై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ నోడల్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు పాటించాల్సిన ఆరోగ్య రక్షణ చర్యలపై మహిళలను చైతన్యం చేసేందుకు కిల్‌కారి పేరిట వాయిస్ కాల్స్‌ను చేయనున్నారని వివరించారు. ఏఎన్‌ఎం వద్ద నమోదు చేసుకునే సమయంలో ఇచ్చిన నంబర్‌కు ఈ కాల్స్ వస్తాయని చెప్పారు. కాల్స్‌ను గర్భిణులు వినేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు కృషి చేయాలని కోరారు. నేషనల్ టీమ్ బీసీహెచ్ కన్సల్టెంట్ రవీంద్ర, రాష్ట్ర ప్రోగ్రామింగ్ మేనేజర్ రాజు, డీఐఓ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ జడ్జి వాణి పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులతో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ర్యాగింగ్, డ్రగ్స్, బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలను వివరించారు. ఏ అవసరమొచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. ప్రాణరక్షణ కోసం ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ప్రిన్సిపల్ షరీఫ్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రేబాల ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలో గల రామ్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సీఆర్పీ డొంక, మసీదు సెంటర్, ఏసీనగర్, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్, వాణిశ్రీవీధి, బాబూగిరిజన కాలనీ, ఉస్మాన్‌సాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జర్నలిస్ట్ భవన్ ప్రారంభం

నెల్లూరు(బారకాసు): ఆచారివీధిలో నూతన జర్నలిస్ట్ భవన్ (ప్రెస్‌క్లబ్)ను మంగళవారం ప్రారంభించారు. టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఏసీ సుబ్బారెడ్డి, రసూల్, పిట్టి సత్యనాగేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ సదారావు పాల్గొన్నారు.

వినాయకుడికి చందనాలంకారం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిర ప్రాంగణంలో కొలువైన జ్యోతి వినాయకస్వామి మందిరంలో స్వామివారికి చందనాలంకారాన్ని బుధవారం నిర్వహించనున్నామని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

క్వాంటమ్ పింఛన్ పునరుద్ధరణకు వినతి

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు గతంలో మాదిరిగా అడిషనల్ క్వాంటమ్ పింఛన్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో 70 ఏళ్ల పింఛనర్లకు 10 శాతం, 75 ఏళ్లకు 15 శాతం అడిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను ఇచ్చేవారని చెప్పారు. వృద్ధాప్య పింఛన్, వలంటీర్ల వేతనాలను పెంచారని, అయితే తమను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.